క్లుప్తంగా

రేపటి నుంచి మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

కుప్పం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం మండలంలో మూడు రోజులు పల్లెబాట నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. సోమవారం దాసేగానూరు, కంగుంది, మహ్మదపురం, నాయనూరు, బీడీ చెన్లు, చందం, నూలుకుంట, కొత్తపలి, గెరిగెనేపల్లి, పెద్దబంగారునత్తం గ్రామ పంచాయతీలలో పర్యటిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం కొటాలూరు, అడవిబూదుగురు, వి.మిట్టపల్లి, వానగుట్టపల్లి, చెక్కునత్తం, ఉర్లఓబనపల్లి, గోనుగూరు, కృష్ణదాసనపల్లి, జరుగు, గుడ్లనాయనపల్లి పంచాయతీల్లో పర్యటించనున్నారు. బుధవారం వెండుగంపల్లి, నడుమూరు, మంకలదొడ్డి, మధ్యాహ్నం 12 గంటలకు మల్లానూరు, టి. సదుమూరు, మెట్లచేను గ్రామాల్లో బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం పైపాళ్యం పంచాయతీల్లో ప్రజలతో మమేకమై మూడు రోజుల పర్యటన ముగించనున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గణితంలో అష్టావధానం


అష్టావధానంలో గణిత టీచర్లు

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత టీచర్ అరుణ్ శివప్రసాద్, ఇతర మండలాల నుంచి వచ్చిన ఎనిమిది మంది గణిత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో శనివారం గణిత అష్టావధానం నిర్వహించారు. వారు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. అనంతరం విద్యార్థులలో గణితం పట్ల భయం పోగొట్టేలా, ఆసక్తి పెంపొందేలా కొన్ని మెలకువలను నేర్పించారు. హెచ్‌ఎం జయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లు రేపు

కుప్పంరూరల్: ఇంటర్ మీడియట్ ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసి పాలిటెక్నిక్ 2వ సంవత్సరంలో చేరే విద్యార్థులకు 24న సోమవారం తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జగన్నాథరావు తెలిపారు. ఇంటర్ ఒకేషనల్ కోర్సులు, బ్రిడ్జి కోర్సు పూర్తిచేసి పాలిటెక్నిక్ కోర్సులపై ఆసక్తి ఉన్న అభ్యర్థులు కుప్పం పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న వారికి 24న సోమవారం తిరుపతి పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యలు లేకుండా చూడాలి


వలంటీర్లకు సూచనలిస్తున్న ఎంపీపీ రామమూర్తి

చౌడేపల్లె: వలంటీర్లకు కేటాయించిన 50 గృహాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని, అలాగే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రామమూర్తి సూచించారు. శనివారం చౌడేపల్లె -1 సచివాలయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సర్పంచ్ వరుణ్ భరత్, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, సచివాలయ కన్వీనర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

27 నుంచి మంత్రి పర్యటన

పుంగనూరు: పుంగనూరు మున్సిపాలిటీలో మంత్రి పెద్దిరెడ్డి ఐదు రోజుల పాటు పర్యటిస్తారని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా శనివారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 27న ఉదయం 7 గంటలకు ఎస్‌ఎస్.పేటలోని హనుమంతరాయుని దిన్ని నుంచి మంత్రి పర్యటన ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 31న సాయంత్రం వరకు ఐదురోజుల పాటు మంత్రి పర్యటన జరుగుతుందని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

గ్రామాల్లో ప్లాస్టిక్ పాలక్యాన్ల చోరీ

పలమనేరు: మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీ ప్లాస్టిక్ పాలక్యాన్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారు. ఆమేరకు మండలంలోని కరిడిమొడుగు, కోటూరు, కోతిగుట్ట గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారు. ఇందుకు సంబంధించి కరిడిమడుగులో నాలుగు క్యాన్లు చోరీ కావడంతో ఆ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుబ్బారెడ్డి చోరీపై దర్యాప్తు చేస్తామని తెలిపారు.

పలమనేరు దాబాలపై డీటీఎఫ్ దాడులు

పలమనేరు: పట్టణ సమీపంలోని పలు దాబాలపై చిత్తూరు డీటీఎఫ్(డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్) బృందం శుక్ర, శనివారాల్లో దాడులు చేసింది. ఇందులో భాగంగా పలు దాబాల్లో మద్యం తాపిస్తున్నందున వారిపై కేసులు నమోదు చేశారు. దాబాల్లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం తాగుతున్న పలువురిపై కేసులను నమోదు చేశారు. పట్టణంలోని పలు దాబాల్లో విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నందున కొందరు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో స్క్వాడ్ అధికారులు పట్టణంలో దాడులను నిర్వహించారు. పలు దాబాలపై నిఘా పెట్టామని తనిఖీలుంటాయని సెబ్ సీఐ ఎల్లయ్య తెలిపారు.

కౌండిన్యలో హైరానా!



గౌనితిమ్మేపల్లి వద్ద హైనా దాడికి మృతి చెందిన దూడ, గాయపడ్డ ఆవు


హైనా(ఫైల్)

- మాయమవుతున్న మేకలు, గొర్రెలు
- తాజాగా లేగదూడను చంపేశాయి
- ఇది పులి పనేనని గిలిపడుతున్న జనం
- పులికాదు హైనా అంటున్న అటవీశాఖ

పలమనేరు: కౌండిన్య అడవిలో గత కొన్నాళ్ల నుంచి హైనాల దాడికి పలు మేకలు, గొర్రె పిల్లలు, దూడలు మృత్యువాతపడుతున్నాయి. స్థానిక అడవిలోకి పశువులను, మేకలను మేతకు తోలుకెళ్లే కాపరులు ఆందోళన చెందుతున్నారు. కొన్నాళ్లుగా ఈ ప్రాంతంలో మేకలు, గొర్రెలు, దూడలను హైనాలు పొట్టనబెట్టుకుంటున్నాయి. తాజాగా బైరెడ్డిపల్లి మండలంలోని గౌనితిమ్మేపల్లి అటవీ సమీప పొలాల వద్ద సోమవారం ఓ లేగదూడను చంపాయి. మరో దూడ గొంతు కొరికి గాయపరిచాయి. అయితే ఇది పులి పనేనని రైతులు లతీఫ్, లక్ష్మీపతి భావించారు. పులిలా చారలు కలిగిన హైనా అనే జంతువని అటవీశాఖ అధికారులు క్లారిటీ ఇస్తున్నారు. గతంలో ఇక్కడ హైనాల సంతతి తక్కువగానే ఉండేదని ప్రస్తుతం సంచరిస్తున్న పెద్ద హైనాలు తమిళనాడు అడవి నుంచి వచ్చాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఏదేమైనా ఇప్పుడు కౌండిన్య అడవికి ఆనుకుని ఉన్న పల్లె వాసులకు హైనాతో హైరానా పడుతున్నారు.

ఆందోళన చెందుతున్న పశువుల కాపరులు..

కౌండిన్య అభయారణ్యంలో పులి ఉందంటూ పుకార్ల కారణంగా అడవుల్లోకి జీవాలను మేతకు తోలుకెళ్లాలంటే పశువుల, మేకల కాపరులు హడలిపోతున్నారు.

ముఖ్యంగా రేంజ్ పరిధిలోని నెల్లిపట్ల, బాపలనత్తం, వెంగంవారిపల్లె, కడతట్లపల్లె, కుప్పనపల్లె, దేవదొడ్డి, కైగల్, కస్తూరినగరం, చింతమాకుల పల్లె, కాలువపల్లె, మండీపేట కోటూరు, జగమర్ల అటవీ సమీప గ్రామాలకు చెందిన వారి జీవాలు తరచూ అదృశ్యమవుతున్నాయి. సాయంత్రం మందలను యజమానులు గమనిస్తేగానీ విషయం బయటపడడం లేదు. కాపరులు అడవిలోకి వెళ్లి పరిశీలిస్తే మృతి చెందిన కబేళాలు దర్శనమిస్తున్నాయి.

మూగజీవాలను చంపి రక్తం తాగుతాయట..

కౌండిన్య అభయారణ్యంలో ఇప్పటి వరకు వీటి బారిన పడి మృతిచెందిన మేకలు, దూడల మృతదేహాలను పరిశీలించిన అటవీశాఖ అధికారులు ఇది హైనాల పనేనని తేల్చారు. ఎందుకంటే పులి అయితే జంతువు మాంసం కూడా తినేస్తుందని హైనాలు గొంతు కొరికి కేవలం రక్తం మాత్రమే తాగుతాయని చెబుతున్నారు. ఇవి పులి కంటే కాస్త తక్కువ ఎత్తు కలిగి, పులి చారలు కలిగి దూరం నుంచి చూస్తే పులిలాగానే కనిపిస్తాయని అధికారులు తెలిపారు. ఎక్కడైతే ఏనుగుల సంచారం ఉంటుందో ఆ అడవుల్లో పులులు ఉండవని చెబుతున్నారు. ఇటీవల అడవి జంతువుల గణన చేసినప్పుడు కూడా పులుల పాదముద్రలు కనిపించలేదని వారు చెబుతున్నారు. అయితే ఈ అడవిలో గుంత నక్కలు, తోడేళ్లు, అడవి కుక్కలు, అడవి పందులు మాత్రమే ఉన్నాయని తెలిపారు.



ఈ అడవుల్లో పులులు లేవు...



కౌండిన్య అడవిలో పులులు లేవు. అయితే ఇటీవల దూడలను చంపింది హైనానే. తాము కూడా అడవిలో ట్రాకర్స్ ద్వారా వాచ్ చేయిస్తున్నాం. ప్రజలు పులి అనుకుంటున్నారు ఇది ఒట్టిమాటే. అయితే ఇది చూసేందుకు పులిలాగా చారలు కలిగి ఉంటుంది. హైనాను దూరం నుంచి చూస్తే పులికంటే కాస్త చిన్నదిగా అలాగే కనిపిస్తుంది. దీని పాదముద్రలు కొంచెం పులిలాగే కనిపిస్తుంటాయి.

– శివన్న, ఎఫ్ఆర్వో, పలమనేరు రేంజ్

వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు రూ.50వేల విరాళం


నగదు అందజేస్తున్న దాత

కుప్పంరూరల్: మండలంలోని కంగుంది గ్రామంలో ఏర్పాటు చేయనున్న వాల్మీకి విగ్రహానికి స్టేట్ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నాగభూషణమ్మ భర్త, వైఎస్సార్ సీపీ నేత సుబ్బరాజు రూ.50,101లను తన వంతు విరాళంగా ఇచ్చారు. శనివారం కంగుంది గ్రామంలో సమావేశమైన వాల్మీకి కులస్తుల సమక్షంలో నగదును విగ్రహ నిర్మాణ సభ్యులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకుల అభివృద్ధికి ఎంతో చేశారని చెప్పారు. ఇందుకు ఉదాహరణే వాల్మీకులను ఎస్టీల్లో చేర్చుతూ అసెంబ్లీ తీర్మానం చేయడం అన్నారు. ఈశ్వర్, జైపాల్, బాబు, వాల్మీకి కులస్తులు ఉన్నారు.

3,281 ఇళ్లు మంజూరు


మండల హౌసింగ్ ఏఈ

వి.కోట: నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇల్లు పథకంలో మండలంలో 2020 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 3,281 ఇళ్లను మంజూరు చేసినట్లు హౌసింగ్ ఏఈ రామచంద్ర తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో రాష్ట్ర ప్రభుత్వం 3,281 ఇళ్లను మంజూరు చేయగా, అందులో రూ.42 కోట్లతో 1,662 ఇళ్లు పూర్తి అయినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు పూర్తిచేయని లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలని సూచించారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్యపరీక్షలు చేసుకుంటున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: పట్టణంలోని అస్రా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించినట్లు ఆస్పత్రి ఎండీ వసీమ్‌ఖాన్ తెలిపారు. శిబిరాన్ని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ప్రారంభించి వైద్యపరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆయన వైద్యపరీక్షలు చేయించుకున్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం


అధ్యక్షుడు అనిల్‌కుమార్


ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి

పుంగనూరు: పుంగనూరు రోటరీక్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ డైరెక్టర్ డాక్టర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షుడుగా అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రాజారెడ్డిలను ఎన్నుకున్నారు. అలాగే డైరెక్టర్లుగా డాక్టర్లు ప్రభాకర్, శరత్‌కుమార్, పూలత్యాగరాజు, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌జెట్టి, కిషోర్, హరిప్రసాద్, మునిరాజ, సురేష్, గణేష్, హరగోపాల్, ప్రవీణ్, అసాదాలి, జాన్‌లను ఎన్నుకున్నారు.

దారి కల్పించాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న రాజుపేట గ్రామస్తులు

రామకుప్పం: మండలంలోని రాజుపేట గ్రామంలో 52 మంది రైతులు వెళ్లే దారి ఆక్రమణకు గురైందని స్థానిక వైఎస్సార్‌సీపీ నేత బాలమురుగన్ ఆధ్వర్యంలో శనివారం గ్రామస్తులు రాస్తారోకో చేశారు. రాజుపేట రోడ్డు–రామకుప్పం రోడ్డుపై రాస్తారోకో నిర్వహించడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. రెండు నెలల క్రితం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని బాలమురుగన్ తెలిపారు. విషయం తెలిసి ఎస్ఐ కృష్ణయ్య అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. తహసీల్దార్ మురళి ఆదేశాలతో వీఆర్ఓ మహేంద్ర అక్కడికి చేరుకుని ఆక్రమణకు గురైన దారిని పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

ఆర్బీకే సిబ్బందికి శిక్షణ


అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శివకుమార్

సదుం: పుంగనూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో ఉన్న ఆర్బీకే సిబ్బందికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్‌లో పంట నమోదుపై ఏడీఏ శివకుమార్ అవగాహన కల్పించారు. ప్రతి పంటపొలానికి వెళ్లి ఫొటోతీసి యాప్‌లో నమోదు చేయాలన్నారు. పొలంబడి కార్యక్రమ నిర్వహణపై ఆయన వివరించారు. ఏఓలు, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌కు ఐదు సెంట్ల భూమి


తహసీల్దార్ నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న శివశంకర్‌నాయుడు

పుంగనూరు: పుంగనూరు బార్ అసోసియేషన్‌కు ఐదు సెంట్ల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ తహసీల్దార్ సీతారామన్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణంలోని మూడు కోర్టుల్లోనూ న్యాయవాదులు, కక్షిదారుల సంఖ్య పెరగడంతో నూతన భవనం నిర్మించుకునేందుకు స్థలాన్ని కేటాయించాలని న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు గల్లా శివశంకర్‌నాయుడు ఆధ్వర్యంలో న్యాయవాదులు కలిసి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి గత నెలలో వినతిపత్రం అందజేశారు. పరిశీలించిన మంత్రి పెద్దిరెడ్డి కలెక్టర్‌తో చర్చించి న్యాయవాదులకు అవసరమైన ఐదుసెంట్ల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఉత్తర్వులను పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు గల్లా శివశంకర్‌నాయుడు, కార్యదర్శి ఆనంద్‌కుమార్‌కు తహసీల్దార్ అందజేశారు. శివశంకర్‌నాయుడు మాట్లాడుతూ ఇరవై ఏళ్లుగా పరిష్కారంకాని సమస్యను సహృదయంతో పరిష్కరించి, స్థలాన్ని కేటాయించిన మంత్రి పెద్దిరెడ్డికి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్పకు కృతజ్ఞతలు తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం


పులిచెర్లలో సన్మానం


రొంపిచెర్లలో సన్మానం

పులిచెర్ల(కల్లూరు): మండలంలో బదిలీ అయిన ఉపాధ్యాయులు, పదోన్నతిపై వెళ్లిన వారికి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఘనంగా సన్మానించారు. మండలం నుంచి 28 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ రాజశేఖర్, ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రం

రొంపిచెర్ల: ఉపాధ్యాయ వృతి ఎంతో పవిత్రమైందని తిరుపతి డీవైఈఓ ఆనందరెడ్డి అన్నారు. శనివారం రొంపిచెర్ల తెలుగు ప్రాథమిక పాఠశాలలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను బదిలీపై వెళుతున్న ఎంఈఓ హసన్‌బాషాను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ శ్రీనివాసులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రమణారెడ్డి, రమేష్, చెంగారెడ్డి, సి.వి.రమణ, రవికుమార్ రెడ్డి, జయరామిరెడ్డి, యల్లప్ప, అక్బర్‌బాషా, నారాయణనాయుడు, సీఆర్‌పీలు అనసూయ, కిరణ్, రాజేంద్ర పాల్గొన్నారు.

బడికెళ్లే పిల్లలు బడిలోనే ఉండాలి


టి.వడ్డూరు పాఠశాలలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎస్ఎస్ఏ పీడీ వెంకటరమణారెడ్డి

పలమనేరు: బడికెళ్లే పిల్లలు కచ్చితంగా బడికెళ్లాలని జిల్లా సమగ్రశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణారెడ్డి సూచించారు. టి.వడ్డూరు పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. గ్రామంలోని బడికి రాని పిల్లలను గుర్తించి వారు బడికి వెళ్లేలా కృషిచేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

చురుగ్గా బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే


189 కొత్తపల్లె వద్ద జరుగుతున్న వంతెన నిర్మాణం

గుడిపాల: మండల పరిధిలో బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చురుగ్గా సాగుతున్నాయి. 258 కిలోమీటర్ల మేర జరిగే ఈ రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బెంగళూరు నుంచి తమిళనాడు శ్రీపెరంబుదూరును కలుపుతూ రోడ్డు పనులు చేపట్టారు. మండలంలోని దాయంవారిపల్లె నుంచి 189కొత్తపల్లె, వసంతాపురం, కుప్పిగానిపల్లె, చలిచీమలపల్లె మీదుగా సాగుతోంది. స్తంభాలను నిర్మించి వాటిపై దిమ్మెలను ఏర్పాటు చేస్తున్నారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన తారక్‌నాథ్

రొంపిచెర్ల: మండలంలోని చిచ్చిలివారిపల్లె గ్రామ సచివాలయ గ్రేడ్–5 కార్యదర్శిగా తారక్‌నాథ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కార్యదర్శి మల్లికార్జునను పీలేరు మండలం అగ్రహారం సచివాలయానికి బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న కార్యదర్శి తారక్‌నాథ్‌ను చిచ్చిలివారిపల్లె సచివాలయానికి బదిలీ చేశారు. అనంతరం ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ చిచ్చిలి అరుణమ్మను మర్యాద పూర్వకంగా కలిశారు.

సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతల స్వీకరణ


వెంకటరమణ

సదుం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ అసిస్టెంట్‌గా వెంకటరమణను బదిలీపై వచ్చి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పులిచెర్ల మండలం కొత్తపేట నందనవనం జూనియర్ కళాశాల నుంచి సదుంకు వచ్చారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి


సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్


జరుగు గ్రామంలో..


పెద్దచల్లారగుంటలో..

కుప్పం: జగనన్న సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 16, 17 వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువీకరణపత్రాలను అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయం–2లో ఎక్కువ సర్టిఫికెట్లు నమోదు చేసిన నలుగురు వలంటీర్లు తిరుమల దేవి, ప్రమీల, కాంచన, దివ్యభారతిలను అభినందించి తన వంతుగా నగదు బహుమతి అందజేశారు. కౌన్సిలర్ రంగయ్య పాల్గొన్నారు.

600 ధ్రువీకరణపత్రాల అందజేత

కుప్పంరూరల్: మండల పరిధిలోని జరుగు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 600 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు. 45 మంది ఆధార్‌కార్డులకు ఫోన్ నంబర్‌ను అనుసంధానం చేశారు. తహసీల్దార్ పార్వతమ్మ, సర్పంచులు ఝాన్సీ, మల్లిక, ఎంపీటీసీ సుగుణ పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు ఆదరణ..

బైరెడ్డిపల్లె: తీర్థం, పెద్దచల్లారగుంట సచివాలయ పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, సర్పంచులు జ్యోతమ్మ, నారాయణరెడ్డి, రమణారెడ్డి, ఝాన్సీలక్ష్మి, ఎంపీటీసీలు రవీంద్రమ్మ, అభిరామ్ పాల్గొన్నారు.

ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు

రామకుప్పం: విజలాపురం పంచాయతీ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ మండల కో కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వేణుగోపాల్ గౌడ్, నేతలు మురుగేష్, సూరి, డాక్టర్ మురళి, మంజునాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాబు పాల్గొన్నారు.


విజలాపురంలో..


సంగనపల్లెలో..

1,350 ధ్రువీకరణ పత్రాల అందజేత

గుడుపల్లె: సంగనపల్లె, సోడిగానిపల్లెలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 1,350 లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణపత్రాలు అందజేశారు. జేసీఎస్ కన్వీనర్ రామక్రిష్ణ, సర్పంచ్ అమరనాథ్, నేతలు గోవిందన్, నారాయణస్వామి, యూత్ రవి, విశ్వనాథ్, తహసీల్దార్ గుర్రప్ప, ఏఓ నాగరాజు, ఈఓపీఆర్డీ శంకర్ పాల్గొన్నారు.

సురక్షలో 384 సేవలు

శాంతిపురం: జగనన్న సురక్షలో భాగంగా రెండు గ్రామ సచివాలయాల్లో జరిగిన క్యాంపుల్లో 384 సేవలను అందించినట్టు ఎంపీడీఓ హేమమాలిని తెలిపారు. మొరసనపల్లిలో 269, కడపల్లి గ్రామ సచివాలయంలో 115 సేవలను అందించామన్నారు. రేషన్ కార్డులకు సంబంధించి కడపల్లిలో అత్యధికంగా 41 కుటుంబాల సమస్యలను పరిష్కరించామన్నారు.

414 సమస్యల పరిష్కారం


పలమనేరు మున్సిపాలిటీలో జగనన్న సురక్ష


పెంగరగుంటలో..

పలమనేరు: మున్సిపాలిటీ, మండలంలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 414 సమస్యలను పరిష్కరించారు. మున్సిపాలిటీలోని ఎద్దులసంత వీధి సచివాలయ పరిధిలో జరిగిన కార్యక్రమంలో కోదండరామయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 310మందికి అవసరమైన సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. పెంగరగుంటలో జరిగిన కార్యక్రమంలో 104 మందికి అవసరమైన సర్టిఫికెట్లను అందజేశారు. కౌన్సిలర్లు పెయింట్ రెడ్డి, హేమంత్, పలమనేరు మండల కన్వీనర్ బాలాజీనాయుడు, రాష్ట్ర కార్యదర్శి రంగన్న, సర్పంచుల సంఘ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, నేతలు వినాయక, రాజారెడ్డి, వస్త్రాయప్ప, మల్లికార్జున, మునిరాజులు పాల్గొన్నారు.